**Andhra Jyothi**

# వర్సిటీ కొలువులూ టీఎస్‌పీఎస్సీకే!

- **సర్కారు సూత్రప్రాయ నిర్ణయం**
- **వచ్చే కేబినెట్‌లో చర్చ.. త్వరలో ఆర్డినెన్స్**

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల్లోని బోధన, బోధనేతర సిబ్బంది పోస్టుల భర్తీ అధికారాన్ని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)కి దఖలు పరుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పోస్టుల భర్తీపై వర్సిటీలకున్న అధికారాలను తొలగిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయనుంది. తెలంగాణలోని పలు వర్సిటీల్లో దాదాపు 6 వేల దాకా ఖాళీలున్నాయి. అయితే, వర్సిటీల్లో పోస్టుల భర్తీపై ఆది నుంచీ వివాదాలు కొనసాగుతున్నాయి. ఉద్యోగాల భర్తీపై యూనివర్సిటీల వీసీలకు సంపూర్ణ అధికారాలు ఉండటంతో నియామకాలు అడ్డగోలుగా జరుగుతున్నాయనే విమర్శలున్నాయి. సీఎం కేసీఆర్ కూడా ఈ అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం కేసీఆర్ ఓయూలో నియామకాలపై మండిపడ్డారు. వర్సిటీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకోవడంపై ఆ మధ్య రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వివాదం తలెత్తింది. ప్రొఫెసర్లు కోదండరామ్, హరగోపాల్ నిరసనలకు బాసటగా నిలిచారు. వర్సిటీల్లోని నియామకాలను కూడా టీఎస్‌పీఎస్సీ ద్వారానే భర్తీ చేస్తామని ప్రభుత్వం సంకేతాలిచ్చింది. కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయంతోపాటు పీవీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్సిటీ, ములుగులోని అటవీ విశ్వవిద్యాలయాలు పోస్టులను భర్తీ చేయాలంటూ వివరాలను టీఎస్‌పీఎస్సీకి పంపించాయి. వర్సిటీల పోస్టులను భర్తీ చేసే అధికారం తమకు లేదని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి అనడంతో వర్సిటీలు ప్రభుత్వాన్ని ఆశ్రయించాయి. దీనిపై త్వరలో కేబినెట్‌లో చర్చ జరగనుందని, దసరా ముందు దీనికి సంబంధించిన ఆర్డినెన్స్ వెలువడే అవకాశం ఉందని తెలిసింది.